

# పదవి

పులిపాక శ్రీరామచంద్రమూర్తి

**సాయంత్రం** ఐదు గంటలవుతూంది.

ధర్మారావు మసక బారిన చిన్న అద్దంలో మొహాన్నొకసారి పరీక్షగా చూసుకుని, మకిలి పట్టిన దువ్వెనతో చాలా సేపు తల దువ్వుకున్నాడు. జుట్టు అణగ లేదు. ప్లాస్టిక్ చెంబులోని నీళ్ళలో దువ్వెన ముంచి మళ్ళీ దువ్వుకున్నాడు. సంతృప్తిగా ఒకసారి తలాడించి, అరిగిపోయిన స్లిప్పర్సు వేసుకుని పంట్, చొక్కా బాగా మాసిపోలేదని తనకు తానే సర్ది చెప్పుకుని, తల బాగా కిందికి వంచి ఆ పూరి పాకలోంచి బయటి కొచ్చాడు.

కూలి కెళ్ళిన తల్లి, చెల్లెళ్ళు ఇంకా ఇంటికి రాలేదు. ఆ ఇంటికి గొళ్ళెం పెట్టాల్సిన అవసరం లేకపోయినా తలుపు లాగి, గొళ్ళెం పెట్టి రోడ్డు ఎక్కాడు.

పంచాయతీ వారు అయిష్టంగా వేయించిన పంపు దగ్గర నీళ్ళ కోసం చిన్న సైజు ఉద్యమం ప్రారంభమై అప్పటికే పావు గంటైంది. వంటి మీద బట్టల్లేని పిల్లలు దుమ్ములో కేరింతలు కొడుతూ ఆడుతున్నారు. కొత్తగా కట్టిన చర్చి మీద కొత్త గంట సాయంత్రపు నీరెండలో మెరు స్తూంది.

ధర్మారావు పల్లెలోంచి పూళ్ళోకి వచ్చి ప్రెసిడెంటుగారి ఇంటి వైపు నడక సాగించాడు హుషారుగా.

పనీ పాటా లేని బికారిగాడికి, పంచ భక్ష్య పరమాన్నా లారగించే పుర ప్రముఖుడికీ కూడా సమానంగా పదవీ వ్యామోహం ఉండొచ్చు. అందులో తప్పేం లేదు. ధర్మారావుకి ఇప్పు డా పదవీ వ్యామోహం పట్టుకుంది. అతను బికారి కాడు. ప్రముఖుడూ కాడు. సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ, కూలీకికూడా వెళ్ళే చిన్న రైతు మాత్రమే.

జేబులోంచి బీడీ కట్ట తీసి, ఒక బీడీ నోట్లో పెట్టుకుని గాలి వాలుకి తిరిగి ముట్టించాడు. అతనికి చాలా సంతోషంగా, చాలా గర్వంగా ఉంది. తన చుట్టూ ఉన్న వాళ్ళందరికంటె తాను గొప్ప వాడై పోవడానికి అవకాశ ముందని అతని కా ఉదయమే తెలిసింది.

ఆ రోజు ఉదయం చర్చి ముందున్న వేపచెట్టు దగ్గర కొచ్చే సరికి అక్కడ పంతులు దేవసహాయం, మిలిటరీ నించి సెలవు మీదొచ్చిన ఆనందరావు, ఇంకా నలుగురైదుగురు బక్కచిక్కిన పల్లె మనుషులు కూర్చొనున్నారు. ధర్మారావుని చూడగానే దేవ సహాయం పలకరింపుగా నవ్వాడు. "రా రా, కూచో" అని ఆహ్వానించాడు. ధర్మారావు జేబులోంచి బీడీ తీసి అక్కడే నిలబడ్డాడు కూర్చోకుండా.

"మనోళ్ళకో ఎపుడికో కాని పూరికి ప్రెసిడెం టయ్యే అదృష్టం పట్టింది" అన్నాడు దేవసహాయం చార్మినార్ సిగరెట్ నోట్లో పెట్టుకుని. ధర్మారావు తన బీడీని, ఆ సిగరెట్ని ముట్టించాడు. తరవాత నవ్వుతూ అడిగాడు—

"మనోడు ప్రెసిడెంటైతే పూళ్ళో పెద్దోళ్ళు పూరుకుంటారా!"

"ఆళ్ళు చేసేదేందిరా? గవర్నమెంటోడే మనది రిజర్వు (డు.) పంచాయతీ అని కాగితాలు పంపించారంట. ఈ సారి మాలమాదుగుల్లోంచి ఎవుడో ఒకడు ప్రెసిడెంటవ్వాలంట."

"అయితే మరి మనకి చాన్సే" అన్నాడు ధర్మారావు హుషారుగా.

"ఇవన్నీ పేరుకేరా! పూళ్ళో పెద్దోళ్ళు ఎక్కడేరి ముద్రెయ్యమంటే ఆడెయ్యటమే గెలిసినోడి పని." ఆనందరావు బిగ్గరగా నవ్వాడు..

అతను మిలిటరీలో చేరాక మధ్యమాంసాలతో చాలా బలంగా, హుందాగా తయారయ్యాడు, లావుపాటి మీసాలు, పొట్టిగా కత్తిరించిన జుట్టు, లైట్‌గా ఉండే షర్ట్‌తో అతన్ని నాలుగేళ్ళ క్రితం చూసిన వాళ్ళెవరూ ఈ రోజు వెంటనే పోల్చుకో లేరు.

"మరి మనగాళ్ళో ఎరుకలోళ్ళు, యానాదోళ్ళు ఉన్నారు కదా" అన్నాడు ధర్మారావు గొంతు తగ్గించి రహస్యంగా.

"మనం షెడ్యూల్ కాస్ట్రోళ్ళం. ఆళ్ళు ట్రైబోళ్ళు. మన పంచాయతీ యస్సీలది. అంటే మనదే" అన్నాడు దేవసహాయం ధర్మారావుని ఒకటో క్లాసు కుర్రాడిగా చూస్తూ.

"మరి మనోళ్ళలో సాలామంది నిలబడతారేమో?" గాభరాగా అడిగాడు ధర్మారావు.

"మన్లో మనకి ఫైటింగ్ పెట్టి పెద్దోళ్ళు తమాసా చూస్తారు. గ్రామ కక్షలంటే ఇన్నాళ్ళూ ఉన్నోడికీ, ఉన్నోడికీ మధ్య జరిగేవి కదా! ఇప్పుడు లేనోడికీ, లేనోడికీ మధ్య. ఈ దెబ్బతో మన పల్లెలో ఈడికి ఆరు ముఠాలు, పన్నెండు పార్టీలు. ఇదొరకు మనోళ్ళ కే దన్నా కావాల్సొస్తే నాయుడిగోర్ని అడిగే వోళ్ళం. మనోడు ప్రెసిడెంటైతే మనం ఈణ్ణే అడగాల" అని ఇకఇకా నవ్వాడు దేవసహాయం.

"జోగి జోగి రాసుకుంటే బూడిద రాలుద్దని, మనోడు మనకేం జేస్తాడ్రా?" అన్నాడు ఆనంద

రావు.

ధర్మారావు మాత్రం అప్పటికే తాను ప్రెసిడెంటయినట్టు, పిల్లా జెల్లా, ముసలీ ముతకా, వాళ్ళూ వీళ్ళూ అనకుండా పల్లె జనమంతా తనని ఈ పనీ, ఆ పనీ చేసి పెట్టమని అడుగుతున్నట్టు, తను చిర్నవ్వుతో "సూద్దాం, సేద్దాం పై అళ్ళతో మాట్లాడాల. నా ఇంట్లో పనికాదు, నీ ఇంట్లో పనీకాదు" అని మెత్త మెత్తగా సర్ది చెబుతున్నట్టు మనసులో అనుకున్నాడు.

"ఏరా! నువ్వు ప్రెసిడెంటుగా పోటీ చేస్తావా?" అడిగాడు దేవసహాయం.

"పోటీ సెయ్యి. పడుసుపిల్లల వోట్లన్నీ నీకే. నీ తరపున నే నడుగుతానుగా" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"సూద్దాం. తొందరేంది?

"ఒక రోజులో అయ్యే పనేరా ఎన్నికలంటే? ఎన్నిళ్ళకి తిరగాల? ఎంతమందితో మాట్లాడాల? నాయుడుగోరు సూడు. ఏడాది ముందునించే ఎన్నికల నవ్వుతో పలకరిస్తా డందర్నీ."

ధర్మారావు సమాధానం చెప్పకుండా నవ్వాడు.

"మనోడు పోటీ సెయ్యటం గారంటీయే. పదండ్రా తీపి కల్లు పోయిస్తాడు" అన్నాడు ఆనందరావు, ముందుకి దారి తీస్తూ. అక్కడ కూర్చున్న బక్క చిక్కిన పల్లె మనుషులు కూడా హుషారుగా బయలుదేరారు.

అందరూ కల్లు తాగాక, డబ్బిచ్చి, వాళ్ళందరి వోట్లు తనకేనని సంతోషించాడు ధర్మారావు. పదవికీ, డబ్బుకీ చాలా దగ్గర సంబంధం ఉందని అతనికి ఆ క్షణంలోనే అర్థమై పోయింది.

ప్రెసిడెంట్‌గా పోటీ చెయ్యాలంటే ముందు ముఖ్యంగా డబ్బుండాలి అనుకున్నా డతను. అలా అనుకోగానే అతనికి తన రెండెకరాల మాగాణి గుర్తొచ్చింది. తల్లిని అప్పుడెప్పుడో బుజ్జగించి ఆశ పెట్టి, బెదిరించి, భయపెట్టి ఆ పొలం తన పేర రాయించుకున్నందుకు, తన పేర రాయించమని కరణంగారి చేత తల్లికి చెప్పించగలిగినందుకు (అలా చెప్పినందుకు కరణంగారు రెండొందలు పుచ్చుకున్నారు) అత వా సమయంలో ఆనందించాడు. అయితే పల్లెలో ఎన్ని వోట్లున్నాయో అవన్నీ నాయుడు గారికీ, చౌదరి గారికీ హక్కు భుక్తమైనవీ నని ధర్మారావుకి తెలుసు. ఆ పెద్దల మాటల్ని బట్టే తప్ప, మరో విధంగా తన పల్లె ప్రజలు తన పట్ల ప్రవర్తించరనికూడా అతనికి తెలుసు. అందువల్ల ఆ ఇద్దరి పెద్దల్లో ఎవరో ఒకరి ప్రాపకం తన కవసరమని అత ననుకున్నాడు. అందుకే ఇప్పుడతను నాయుడు గారింటికి బయలు దేరాడు.

ఎత్తయిన ప్రహరీ గోడ. లోపల విశాలమైన ఆవరణ మధ్య పాతకాలపు పెద్ద ఇల్లు నాయుడు గారిది. ప్రహరీగోడ మీద గేటుకి అటూ ఇటూ రెండు పులి బొమ్మలున్నాయి. ఇంటి ముందు ఎత్తుగా అరుగులున్నాయి. లోపల విశాలమైన హాలు. ఆ హాల్లో ఒక వైపు చెక్క బల్లల మీద వరసగా పేర్చిన ధాన్యపు బస్తాలు, మరో వైపు ఎత్తుగా నిలబడ్డ గాద్రేజు బీరువా, నాయుడు గారికి పల్లె, బస్తీ వాతావరణం రెండూ ఇష్టమే నన్నట్టు కూర్చున్నాయి. ఆ హాలంతా కొంచెం చీకటిగా కొంచెం చల్లగా ఉంది. బయట అరుగు మీద ఒక టీపాయ్ చుట్టూ నాలుగు పేము కుర్చీ లున్నాయి. దానిమీద ఇంగ్లీషు, తెలుగు దిన పత్రిక లున్నాయి. నాయుడుగారు ఎవరైనా ఇంగ్లీషు దినపత్రిక చదివితే చాలా ఆసక్తిగా వింటారు. ఆ ఇంటి ఆవరణలో ఒక పక్క పెద్ద పశువుల సావడి ఉంది. దాని పక్కనే గడ్డి వాము ఉంది. నాయుడుగారు సాధారణంగా పైన లాల్చీ లేకుండా ఒక టర్కీ టవల్ భుజాన వేసుకుని చుట్ట కాలుస్తూ అరుగు మీద కూర్చుంటారు. ఆయన్ని చూడ్డానికి వచ్చిన వాళ్ళు స్టేటస్‌ని బట్టి పేము కుర్చీల్లో కాని, కింద పేడ నీళ్ళు కొట్టిన నేలమీద కాని కూర్చుంటారు.

ధర్మారావు అక్కడా ఇక్కడాకూడా కూర్చోలేదు. తెలుగు పేపరు మీంచి నాయుడుగారు అతన్ని చూశారు. ఆయన చాలా బలంగా, ఒక మాదిరి ఎత్తుగా ఉన్నారు. దట్టమైన కనుబొమలు ఎర్రటి కళ్ళు. కొంచెం నెరిసిన జుట్టుతో హుందాగా ఉన్నారు.

"ఏంరా? ఏంటి ఇసేసాలు?"

ధర్మారావు రెండు క్షణాలు తటపటాయించాడు.

"మీ దగ్గర పని సేదా మని వచ్చానండి"

ఆ మాటకి నాయుడుగారు బిగ్గరగా నవ్వారు.

'కాస్త కూస్త పొలం ఉన్నోడికి నీకు పనెందు కురా? అయినా పనులు నా జేబులో ఉన్నయా?"

"మీరు తలుసుకుంటే అదెంత పని. ఏదో ఒక పని సూపించాల మీరే."

"ఏమున్నయిరా పనులు. ఉన్న పనేదో ఆ రావులు గాడే చేసుకుంటున్నాడు. మళ్ళీ నువ్వెందుకు?"

"నేనుకూడా చేస్తానండి."

"ఏంటి ఇంత అకాత్తుగా వచ్చి, పని చూపించ మంటున్నావు. అసలు కతేంటి?" అని అడిగి అతని జవాబు కోసం ఎదురు చూడకుండా, పేపరు మీ దోసారి కొట్టి మళ్ళీ అన్నా డాయన.

"రోజు లెట్టాగైనా మారిపోయినైరా. రోజు రోజుకీ రాజ్యం మీ సేతుల్లోకి వచ్చేస్తుంది. మనూరుకూడా రిజర్వు పంచాయతీయేనంట. ఈ సారి మీ వోడే ప్రెసిడెంటు చూశావా? మన కళ్ళముందే ఎన్ని ఇచిత్రాలు జరిగి పోతున్నయ్యో?"

"మరేనండి!"

"మెల్లిగా అంటావేరా? నువ్వు ప్రెసిడెంటై నాదగ్గర కొస్తే నేను 'కూర్చోండని కుర్చీ చూపించా లన్నమాట" అన్నారు నాయుడుగారు కుర్చీలోంచి లేవబోతున్నట్టు అభినయిస్తూ.

"మీ కా అవసరం ఏముంది లెండి."

"మంచి మాటన్నావురా. ఏంది పని కావాలని వూడి పడ్డావు!"


"కావాలండి."

"సరే. నీ మాట నే నెందుకు తీసెయ్యాల! ఉన్న పనేదో రావులూ నువ్వూ సమానంగా చేసు కోండి. ఆడి కిచ్చినట్టే నీ క్కూడా జీతం, బత్తెం."

"సరేనండి."

ధర్మారావు వెళ్ళిపోయాక ఈడు నిజంగా పని కోసం వచ్చినాడుకాదు అని అనుకున్నారు నాయుడు గారు. మరునాడు అసలు విషయం తెలిశాక ఆయ నెందుకో ఒక్కసారి చిరునవ్వు నవ్వుకున్నారు. ధర్మారావు పనిలో చేరినరోజునే "ఏరా ప్రెసిడెంటూ అని నవ్వుతూ అన్నారుకూడా.

ధర్మారావు నాయుడు గారింట్లో ఏయే పనులు చేశాడు? పశువుల దగ్గర బాగుచెయ్యటం దగ్గర మంచి, పట్నంలో ఉంటున్న ఆయన రెండో కొడుక్కి నెయ్యి తీసికెళ్ళడం వరకూ అన్ని పనులూ చేశాడు. అది కోతల కాలం కనక ధర్మారావే కోత కోయించి, కుప్పలు వేయించి, ధాన్యం ఇంటికి చేర్చాడు. అప్పుడు కోత కూలీ దగ్గర తన వాళ్ళకీ, నాయుడు గారికీ "మాటా మాటా" వచ్చినప్పుడు అతనే నాయుడుగారి తరపున దాన్ని



పరిచేశాడు. ఆయన బంధువు లింట్లో పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ స్వయంగా చూసొచ్చాడు. ఇవన్నీ కాక 'ఒరే ప్రెసిడెంటూ' అని నవ్వుతూ చెప్పిన ప్రతి పనీ అతను చేశాడు.

కాని అతను చెయ్యాల్సిన పను లివి కావు. ఇంకా గొప్పవి, ముఖ్యమైనవి ఉన్నాయని తెలియ జేశాడు రాఘవరావు. నాయుడుగారికి అతను దూరపు చుట్టం. అతను తొమ్మిదో తరగతి దాకా చదివి, ఆ తరవాత చదవడం మానేశాడు. చదువుకంటె వ్యవసాయం గొప్పదని, వ్యవసాయం కంటె కోతలి కొచ్చే ఆడ కూలీలు గొప్పవాళ్ళని రాఘవరావుకి అర్థమయ్యాక అతను తండ్రి నించి వేరు పడ్డాడు. తరవాత దగ్గర్లో ఉన్న టౌన్లో ఫాన్సీషాపు పెట్టాడు. అలా టౌన్‌లో ఉండడం ప్రారంభించాక అక్కడి బార్లూ, లాడ్జిహౌసులూ బాగా ఆకర్షించాయి. నోట్లో జర్దా పానూ, చేతిలో నిల్స్ పెట్టె, గ్లాస్కో పంచె, లాల్చీతో రాఘవరావు జబర్దస్తీగా ఉంటాడు. ఆ రోజు రాత్రి ధర్మారావుని పిలిపించి అన్నాడు రాఘవ రావు.

"నీకు ప్రెసిడెంటు కావాలని ఉందేరా?"

"ఉందండి."

"ఆ విషయం వూళ్ళో అందరికీ తెలిసి పోయిం దిలే. ఆయన్ని మంచి చేసుకోవటానికి ఆయన దగ్గర పని చేస్తున్నావనికూడా తెలిసిపోయింది."

"..."

"కాని నువ్విప్పుడు చేస్తున్న పనుల వల్ల నీ కేం లాభం ఉండదు."

"అయితే ఏం చేయాలంటారు?" అడిగాడు ధర్మారావు వినయంగా.

వూళ్ళో పెద్దోళ్ళు ఆళ్ళిద్దరే అంటే నాయుడూ, చౌదరి. చౌదరిగారి పాలేరు పోటీ చేస్తాడంట. అంటే చౌదరి ఆడికే సపోర్టిస్తాడు గాని, నీ కివ్వడు. ఇప్పుడు నువ్వు నాయుడుగారి మడిసివ్వాలంటే గొడ్ల కాడ బాగు చెయ్యటవూ, కుప్పల్దగ్గర పడుకోవటవూ కాదు చెయ్యాల్సింది" అని ఆగి సిగరెట్ ముట్టించి మళ్ళీ అన్నాడు రాఘవ రావు—

"మడిసన్నాక లక్ష తొంబై బలహీనత లుంటాయ్. అందులో ముఖ్యమైన వేంటి!"

"ఏవున్నయ్యండి ముంతా, ముండా తప్ప."

"అవి నీ కైనా, నా కైనా, నాయుడిగోరికైనా ఒకటే!" అర్థమైనన్నట్టు నవ్వాడు ధర్మారావు.

"నా దగ్గర డబ్బుల్లేవు గదండి."

"సావెజ్జెప్పినట్టుంది. నీ డబ్బు ఖర్చు కాకూడదు. కాని నువ్వు ప్రెసిడెంటువి కావాలి."

"ఆ రెండెకరాల ముక్క తప్ప ఏవుందండి?"

"అమ్మేసెయ్. తరవాత కొనుక్కోవచ్చు."

"పాపం వగా అమ్మ పెవటోడ్ని తిని తినకా కూడ బెట్టిందండి. అమ్మకుంటే మళ్ళీ సంపాయించటం కలలో మాట." ఆ మాటకి రాఘవరావు పెద్దగా నవ్వాడు. తరవాత అన్నాడు గొంతు తగ్గించి. "చూడ్రా, ధర్మారావూ! మన సమితి ప్రెసిడెంటు నీకు తెలుసా? తెలుసు. మన ఎమ్మెల్యే తెల్సా? తెల్సు. ఆళ్ళు పదవి లోకి రాక ముందు ఎట్లా ఉన్నారో, ఈ రోజు ఎట్లా ఉన్నారో తెలుసు. చెంో టర్మ్ మనవారికి ప్రెసిడెంట్లుగా ఉన్న చౌదరీ, నాయుడూ (మా వోడే అనుకో) పదేళ్ళ కిందట, ఈ రోజు ఒకే లెవల్లో ఉన్నారా! లేరు. అందువల్ల పదవి చేతి కొచ్చినాక పరిస్థితి వేరు. ఇప్పుడు వేరు. అసలందరూ ఎన్నికల్లో పోటీ చెయ్యాలి. చెయ్యాలని ఒకటే తపన పడేది ఎందు కనుకున్నా? ఇందుకే" అని ప్రజాస్వామ్య రీతుల్ని విశదీకరించాడు రాఘవరావు.

"కాని ఉన్నపళంగా పొలవమ్మినా డబ్బు లెవ రిస్తారు?" అడిగాడు ధర్మారావు.

"ఆ సంగతి నా కొదిలెయ్."

మర్నాడు వాళ్ళిద్దరూ ఆర్టీసీ వారి బస్సులో టౌన్ కెళ్ళారు. ఆ బస్సు ఆ వూరికి తప్పనిసరిగా వస్తుంది. దాని క్కారణం "మంచి గిట్టుబాటున్న రూటు" అని ఆ రూటు కొచ్చే కండక్టర్లందరూ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ ఇచ్చేశారు.

66%

మా వివిధ పథకాల వివరాలకోసం ఈ కూపను నింపి, క్రింది చిరునామాకు నేడే పంపండి.

Larsvin Finance
315, 'Chandralok', Sarojini Devi Road, Secunderabad-500 003

Name: ____________________
Address: ____________________
____________________

మీ పెట్టుబడిపై
66 శాతం రాబడి

మా లార్స్‌విన్ మూడేళ్ల క్యాష్ సర్టిఫికేట్లు కొనండి.
మీ రూ. 600 డిపాజిట్ కు రు. 1000 తీసుకొండి.

Larsvin

| | ఫోను: | | ఫోను: | | ఫోను: |
|---|---|---|---|---|---|
| విజయవాడ — | 61473 | విశాఖపట్నం — | 66366 | గుంటూరు — | 23439 |
| ఒంగోలు — | 2737 | నెల్లూరు — | 4284 | తెనాలి — | 3774 |

Ansari & Mohite 83 2

వాళ్ళిద్దరూ ఆ రోజు మధ్యాహ్నం బంగారయ్య దగ్గర కెళ్ళారు. చాలా విశాలంగా నవ్వుతూ లోపలికి ఆహ్వానించాడు. ఆయనకి టౌన్లో ఎనిమిది పోర్షన్లున్న పెద్ద బిల్డింగ్ ఉంది. ఒక జ్యూయేలరీ షాపు ఉంది. ఆ షాపు ముందు వెండి, బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకోబడును అని రాసి ఉన్న బోర్డు కట్టుంది.

బంగారయ్య సుఖంగా పరుపు మీద కూర్చున్నాడు. ఇద్దర్నీ ఒకసారి పరీక్షగా చూసి అడిగాడు.

"ఏం విషయం?

విషయమేమిటో చెప్పాడు రాఘవరావు. "కాబోయే మావూరి ప్రెసిడెంటు' 'అనిధర్మారావుని పరిచయం చేసి.

రెండెకరాల భూమికి తపఖాస్త్రం రాయించుకుని డబ్బిచ్చాడు. ఇద్దరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. ఆ తరవాత నాయుడుగారూ, రాఘవరావూ, ధర్మారావూ బార్లలో మునిగి తేలారు. అలాంటి సమయాల్లో '—'నువ్వు మొత్తానికి ప్రెసిడెంటు కాదగ్గవాడివేరా?" అని నాయుడుగారు పొగిడారు ధర్మారావుని. కులాలు, హరిజనుల గురించి చాలా లిబరల్‌గా మాట్లాడారు. రెండు మూడు సార్లు అతని భుజం తట్టారు.

నాయుడుగారికి మేక్డోల్ ఇష్టం. "ఈ పల్లినాయుడుగారి కంటికి నచ్చదు. ఇంకా హైక్లాస్ది పిల్ల కావాలి" అని కొంత స్వార్థం, కొంత పరమార్థంతో ధర్మారావుకి బోధించాడు రాఘవరావు. అలాగే నడుచుకున్నాడతను. వచ్చిన డబ్బు కళ్ళ ముందే కర్గిపోయింది. ప్రచారానికీ, గోడమీద రాతలకీ, చిన్న చిన్న పార్టీలకి కొద్ది మొత్తాలు బంగారయ్యే ఇచ్చాడు మళ్ళీ. ఇంటింటికీ వెళ్ళి ఓటు తనకే వెయ్యమన్నాడు ధర్మారావు. వీధుల్లో చాలామంది 'కాబోయే ప్రెసిడెంటుగా"రని అతన్ని రిఫర్ చేశారు.

కాని నామినేషన్లు దాఖలు చేయడానికి ఆఖరి రోజు నాయుడిగారి పెద్ద పాలేరు రావులుకూడా నామినేషన్ దాఖలు చేశాడు. ధర్మారావుకి కడుపు మండిపోయింది. నాయుడుగార్ని ఆ విషయం అడిగాడు. దాని కాయన కొద్దిసేపు నవ్వి అన్నారు.

"రావులుగాడు ప్రెసిడెంటు నవ్వాలని చాలా సంబరపడిపోతున్నాడు. ఆడి మాట మన వెందుక్కాదనాల? సర్లే నువుకూడా పోటీ చెయ్యరా అన్నాను. ఆడు నా దగ్గర చాలాకాలం నించి పన్లో ఉంటున్నాడు కదా. ఇప్పుడు మనం కాదంటే బాగుండదు."


"ఇద్దరం రంగంలోకి దిగితే వోట్లు సీలిపోవండీ?" అన్నాడు ధర్మారావు.

"వోట్లు సీలేదేంట్రా? నీకు వోటెయ్యమని జెనానికి చెబుతాను గాని, ఆడి కెయ్యమంటావా?"

"ఈ దెబ్బతో రావులుగోడే మీ మడిసి, నేను కాదని అందరికీ తెలిసి పోద్ది."

"ఆడు నా వోడని నేను సెబుతావా? నువ్వేం దిగులు పడమాకే. ప్రెసిడెంటుగా నువ్వే గెలుస్తావు."

కాని ధర్మారావుకి ఆ నమ్మకం ఎందుకో సడలిపోయింది. రావులుగోడే ప్రెసిడెంటవు తాడని



ఫోటో సుధీర్ బాబ్జి

అతని కెందుకో అనిపించింది.

నిజానికి నాయుడిగారికి కూడా రావుల్ని ప్రెసిడెంటు చెయ్యాలని కోరికేమీ లేదు. కాని రావుడి చెల్లెలు కా కోరికుంది. ఆమె పేరు చంద్రిక. ఆత నెవరితోనో ప్రేమలో పడి మద్రా సెళ్ళిపోయింది. తరవాత ఆమెని వదిలేసి అతనెటో వెళ్ళిపోయాడు. అక్కడ చంద్రికని కొన్నాళ్ళు ఒక సేట్‌జీ చేరదీశారు. అలా ఆమె సేట్‌జీ దగ్గర ఉంటున్న సమయంలో గంజినీళ్ళూ—చికెన్ బిర్యానీ, నులక మంచం—డబుల్ కాట్ బెడ్లూ, మట్టి రోడ్లూ—సిమెంటు రోడ్లూ, మినుకు మినుకు మనే కిరోసిన్ దీపం—నియోన్ లైట్లూ, చినిగిన లంగా—సిల్కు చీరెలు, అచ్చ తెలుగూ స్వచ్ఛమైన ఇంగ్లీషూ...వీటి మధ్య తేడా గమనించి ఏది ఏమైనా మద్రాసు విడిచి వెళ్ళకూడదనుకుంది. కాని రావులూ, అతని బంధువులు కలిసి ఆమెని బలవంతంగా ఇంటికి తీసుకొచ్చారు. సిటీ నుంచి వచ్చాక ఆమెకి కొంత కాలం ఏమీ తోచలేదు. తరవాత నాయుడుగారింట్లో పనికి కుదిరింది. నాయుడుగారు ఆమెకి నిదానంగా నచ్చడం మొదలు పెట్టారు. బస్తీ పిల్లలంటే ఆయనకీ, చౌదరిగారికికూడా తగని మోజు. పైగా తాము బస్తీ మనుషుల్లా ప్రవర్తించ గలమని విశ్వాసంకూడా ఉంది. నాయుడుగారికి ఆమె చేరువైంది క్రమంగా. చౌదరిక్కూడా ఆమె మీద కన్నుందని నాయుడిగారికి తెలుసు. అందుకే చౌదరిగారు 'పోన్లే ఈ సారికి మావోణ్నే ప్రెసిడెంటుని చెయ్యి' అని కబురు పంపించారు. దాని అర్థం ఇద్దరికీ తెలుసు.

ఆ రోజు రాత్రి అంది చంద్రిక—

"ఈ సారి మా అన్నని ప్రెసిడెంటుని చెయ్యి."

"ఆడికి మన పెద పాలేరు పోస్టు చాలు. అంతకంటె అనవసరం" అన్నారు నాయుడుగారు చుట్ట ముట్టించి.

"ఇన్నేళ్ళు నుంచీ నిన్ను నమ్ముకున్న మా అన్న గొప్పా? ధర్మారావుగోడు గొప్పా?"

"మీ అన్నే."

"ఆడు ప్రెసిడెంటు కాకపోతే మాత్తరం మనిద్దరి సంబంధం తెగిపోద్ది."

కొంచెం ఖంగుతిన్నా, నాయుడుగారు నవ్వారు. అలా సంబంధం తెగిపోవడం ఇప్పుడప్పుడే ఇష్టం లేదాయనకి.

"పంచాయతీ ప్రెసిడెంటంటే అమెరికా ప్రెసిడెంటా? ఇందులో ఏం గిట్టుబాటు కాదు."

"నువ్వూ, సౌదరీ ఏం గిట్టుబాటు కాని ప్రెసిడెంటు గిరీ కోసం ఎందుకింత కొట్టుకు చస్తారో, ఖర్చు చేస్తారో అందరికీ తెలుసు. మా అన్న ప్రెసిడెంటు కావాలిసిందే. అంతే."

"స్సరే. నీ ఇష్టం."

"అదీగాక మా అన్నయితే నీ మాట ఇంటాడు. ధర్మారావుగాడు ఇయ్యాల గాకపోతే రేపు తోకజాడించొచ్చు" అంది చంద్రిక మరింత దగ్గరికి జరిగింది.

"ఈ మాట మాత్రం నిజం" అన్నారు నాయుడుగారు మెచ్చుకోలుగా.

తరవాత, రావులు ప్రెసిడెంటయ్యాడు. ధర్మారావు తీసుకున్న అప్పుకింద బంగారయ్య అతని భూమి తీసుకుని నాయుడుగారికి అమ్మేశాడు. ధర్మారావు ముసలి తల్లి ఏడ్పు మొహం పెట్టింది. అతనూ, అతని చెల్లెళ్ళూ కూలీ కెళ్ళడం ప్రారంభించారు.

చాలా రోజులికి టౌన్లో బార్లో కలిశారు నాయుడుగారూ, రాఘవరావూ. కబుర్లు చెప్పుకుంటూ నాలుగో రౌండ్లోకి వచ్చారు. ఎప్పట్నించో అడుగుదా మనుకుంటున్న ప్రశ్న అడిగాడు రాఘవరావు.

"ధర్మారావుగాడి పొలంలో నా కో ఎకరం అమ్మకూడదూ?"

"చౌకగా కొట్టేద్దామనా? అదేం కుదర్దు." నాయుడుగారు పెదాలు చప్పరించారు.

"ఆ పొలం నీకు రావడానికి నేనూ కొంత సాయం చేశాను."

"చేశావు నిజమే. అందుకే ఈ రోజు బిల్లు నాది."

రాఘవరావు ఆ మాటలకి ఏమీ హర్టవనట్టు తేలిగ్గా నవ్వి సిగరెట్ ముట్టించాడు.

"ఏమంటావో నని అడగాను కాని, నిజంగా 'ఆ పొలం' నాకు కొనాలని లేదు. కాని ఒక్కటే మాత్రం నిజం. నిన్ను నమ్మి దగ్గర కొచ్చినోణ్ని మాత్రం నిండా ముంచేశావు" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"నాలుగో రౌండ్లో ఉన్నా నగ్నసత్యం చెప్పావురా. నేను మరొకటి చెబుతాను. మనం ముంచుతామని మనకి తెలుసు. మునిగిపోతామని మాత్రం ఆడికి తెలీదు. ఆదాడి ఖర్మ. ఇది మన అదృష్టం" అన్నారు నాయుడుగారు విచిత్రంగా నవ్వుతూ.

ఖరీదైన విస్కీ తాగుతున్న పెద్దపులి ముందు తను కల్లు వాసన చూస్తున్న పిల్లిలా వూహించాడు రాఘవరావు. అతను ఒక్కసారి పెద్దగా నవ్వాడు.

"కాని ఆడి కా సంగతి ఏదో రోజు తప్పకుండా తెలుస్తుంది" అన్నాడు రాఘవరావు, చేతివేళ్ళ మధ్య ఎర్రగా వెలుగుతున్న సిగరెట్ కేసి కన్నార్పకుండా చూస్తూ. ★